క్లుప్తంగా

ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వాలి

అమలాపురం రూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.శివ అన్నారు. అమలాపురం మండలం వన్నె చింతలపూడిలో బుధవారం ఉపాధి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకుఆరు వారాల వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికులకు 200 పని దినాలు కల్పించాలని, కూలి రేట్లు రూ. 600 పెంచాలని, కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక నాయకులు జీ దైవవాణి, పీ అలేఖ్యా పచ్చమాల కృప తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ సెంటర్ ప్రారంభం

అమలాపురం టౌన్: అమలాపురం కాలేజీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన యోందూరి రాఘవ నాగేశ్వరరావు బ్లడ్ సెంటర్‌ను డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర బుధవారం ఉదయం ప్రారంభించారు. ఆధునాతన సాంకేతిక పద్ధతుల్లో ఏర్పాటు చేసిన బ్లడ్ సెంటరు యాజమాన్య ప్రతినిధి యోందూరి నాగేశ్వరరావును డీఎంఅండ్‌హెచ్‌వో అభినందించారు. జిల్లాలో ఇంతవరకూ లేని అత్యాధునిక టెక్నాలజీతో అనుభవజ్ఞులైన సిబ్బంది ఈ బ్లడ్ సెంటరులో సేవలందిస్తారని డీఎంఅండ్‌హెచ్‌వో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళుతున్న అమ్మమ్మ, మనవడిని వెనుక నుంచి కారు ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ముమ్మిడివరం మండలం గాడిలంక ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఐ.పోలవరం మండలం గుత్తెన దీవికి చెందిన ఓలేటి చంద్రమ్మ, తన మనవడు భీమన్నతో కలసి అమలాపురం ఆసుపత్రికి వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో చంద్రమ్మ తీవ్రంగా, భీమన్న స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని హైవే మొబైల్‌లో అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు హెచ్‌సీ జీబీ స్వామి తెలిపారు.

56 మంది ఉద్యోగాలకు ఎంపిక

యానాం: స్థానిక నేతాజీసుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో బుధవారం ఎల్‌అండ్‌టీ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో 56 మంది విద్యార్థులు వివిధ ట్రేడుల్లో ఉద్యోగాలకు ఎంపిక య్యారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 36 మంది, గతంలో చదివి పాసైన వారు 20 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారందరూ ఎల్‌అండ్‌టీ కాంచీపురంలో రెండు నెలల పాటు శిక్షణ పొందుతారని, అనంతరం వారిని వివిధ ప్రాంతాల్లోని ఎల్‌అండ్‌టీ కేంద్రాల వద్ద ఉద్యోగాల్లో నియమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ ప్రతినిధి డి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

8న జూనియర్ ఇంజినీర్ రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి వచ్చే నెల 8న ఆదివారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు డీపీఅండ్‌ఏఆర్ (ఎగ్జామ్ సెల్) కార్యదర్శి వి జయశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాతపరీక్ష కోసం పుదుచ్చేరిలో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 29 నుంచి తమ హాల్‌టికెట్లను రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 0413-2233338 కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

ఉపాధి పనులను పరిశీలించిన సర్పంచ్ రాజ్‌కుమార్

ఉప్పలగుప్తం: భీమనపల్లి పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 562 మంది ఉపాధి కూలీలు పంట కాలువలు పంట బోదెలు మురుగు కాలువల పూడికతీత వంటి పనులు చేస్తున్నారు. ఈ సందర్భంగా కూలీలు చేస్తున్న ఉపాధి పనులను సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ బుధవారం పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలను సర్పంచ్ అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అయితాబత్తుల శ్రీనివాసరావుకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ కె.బాలరాజు ఉన్నారు.

నకిలీ ధ్రువీకరణ పత్రాలపై నిఘా ఉంచాలి

యానాం: జిప్‌మెర్ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల నియామకాలు చేపనున్న నేపథ్యంలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను అధికారులు తప్పనిసరిగా పరిశీలించి నకిలీలను గుర్తించాలని బుధవారం ఆర్‌ఎల్‌వీ జననాయగం పెరువై ప్రజాసమస్యల పోరాట సంస్థ యానాం శాఖ అధ్యక్షుడు సబ్బతి శ్రీనివాసరావు కోరారు. నకిలీ సర్టిఫికెట్ల ద్వారా కొందరు దరఖాస్తులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే యానాంలో విద్యాశాఖ తదితర శాఖల్లో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి దర్జాగా పలువురు ఉద్యోగాలు చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై విచారణ చేసి అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాల నియామకాల్లో అర్హులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

అక్కరకు రాని అపరాల సాగు

- మొక్క ఏపుగా పెరిగినా కానరాని దిగుబడి
- అకాల వర్షాలతో పైరుకి నష్టం
- ఏటా నష్టాలతో సాగుపై రైతుల అనాసక్తి



పోలేకుర్రులో వర్షాల కారణంగా నీరు నిలిచిపోయి పాడైపోతున్న మినప పంట



జార్జిపేటలో ఏపుగా పెరిగిన కాపులేని పెసర మొక్కలు

తాళ్లరేవు: ఒకప్పుడు రైతులకు కాసుల పంట కురిపించిన అపరాల సాగు ప్రస్తుతం ఏటా నష్టాలపాలు చేస్తోంది. ఏడాదికి మూడు పంటలు పండుతాయని గొప్పలు చెప్పుకునే రైతులు మూడవ పంట రూపంలో నష్టాలను మూటగట్టుకుంటున్నారు. సాగులో జాప్యం, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అపరాల సాగుకు నష్టాలు కలుగుతున్నాయి. దీంతో పదేళ్లగా రైతులు అపరాల సాగుకు దూరమయ్యారు. ప్రస్తుతం తమ ఇంటి అవసరాల కోసం కేవలం కొంతమంది రైతులు అపరాలను సాగు చేస్తున్నా పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో వారికి కూడా అనాసక్తి కలుగుతోంది. అకాల వర్షాల కారణంగా ఈ ఏడాది అపరాల సాగు రైతన్నలకు నష్టాలను మిగిల్చింది.

నకిలీ విత్తనాలు, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం

ముమ్మిడివరం నియోజకవర్గంలో ఏటా సుమారుగా వెయ్యి ఎకరాల్లో అపరాల సాగు చేస్తున్నారు. కొన్నేళ్లగా సాగునీటి ఎద్దడి కారణంగా వరి పంట జాప్యం కావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పంట చేతికి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా అలవాటు పడ్డ కొంతమంది రైతులు మాత్రం ఆశతో పెసలు, మినుములతోపాటు పశు అవసరాల నిమిత్తం పిల్లి పెసర, జీలుగు తదితర పంటలు సాగు చేసినప్పటికీ వారికి ఫలితం దక్కడం లేదు. వరి పంట ఆలస్యం కావడంతోపాటు, ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలు రైతులను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. దీంతో రైతులు అపరాల సాగుకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

తాళ్లరేవు మండల పరిధిలోని పోలేకుర్రు, పి.మల్లవరం, జార్జీపేట, నీలపల్లి, లచ్చిపాలెం, పటవల, జి.వేమవరం తదితర పంచాయతీల్లో అపరాలు సాగు ఎక్కువగా చేస్తుంటారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా రైతులు వ్యవసాయ శాఖ సరఫరా చేసిన మినీ కిట్‌ల ద్వారా అపరాల సాగు చేపట్టారు. పెసర మొక్కలు విరివిగా పెరగడంతో పంట దిగుబడి బాగా వస్తుందని ఆశించారు. మినుము మొక్కలు కూడా బాగానే పెరిగాయి. అయితే పెసరు మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ వర్షాల కారణంగా దిగుబడి లేక నష్టం కలిగే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. ఇలా ఉండగా మినప మొక్కలను ఎండబెట్టి ఒబ్బిడి చేద్దామంటే కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆటంకం కలుగుతోందని రైతులు అన్నారు. కనీసం రోహిణీ కార్తెలో అయినా ఎండలు బాగా కాస్తే పంట చేతికి వచ్చేదని, ఈ ఏడాది సరైన ఎండలే కరువయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. కనీసం వచ్చే పదిరోజులైనా ఎండ కాస్తే పంట చేతికి వస్తుందని, లేకుంటే నష్టపోతామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అల్పపీడనం కారణంగా మరో వారం రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో పంటపై ఆశ వదులుకున్నామని రైతులు చెపుతున్నారు. అపరాల సాగు లాభదాయకంగా మారేందుకు వ్యవసాయశాఖ అధికారులు సూచనలివ్వాలని రైతులు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



అపరాల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, అధిక శాతం మంది పంట సాగు చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఈ ఏడాది మండలంలో 521 ఎకరాల్లో పెసలు, 151 ఎకరాల్లో మినుములు, 77 ఎకరాల్లో పిల్లిపెసర సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట బాగానే ఉంది. సాగు ఆలస్యం, అధిక వర్షాల కారణంగా కొంతమంది రైతులు నష్టపోతున్నారు.
– ఎస్.ప్రశాంతి, వ్యవసాయ శాఖాధికారి, తాళ్లరేవు

వర్షాలు కొనసాగితే నష్టం తప్పదు



ఈ ఏడాది కూడా మూడు ఎకరాల్లో పెసలు, మినుములు సాగు చేపట్టాను. విత్తనాలకు, మందులకు, కూలీలకు కలిపి ఒక ఎకరానికి సుమారు రూ.5 వేలకు పైగా ఖర్చయ్యింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పంట చేతికి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. కనీసం వచ్చే వారం రోజులు ఎండలు కాస్తే పంట చేతికి వస్తుంది. లేకుంటే సుమారు రూ.15 వేలకుపైగా నష్టం సంభవిస్తుంది. – దడాల బుజ్జిబాబు, రైతు, పోలేకుర్రు, గ్రామ పంచాయతీ

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ మహేష్‌కుమార్



సీఎం పర్యటనపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఈనెల 31వ తేదీ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో నిర్వహించే పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి సీఎం పర్యటన ఏర్పాట్లపై విధులు, బాధ్యతలను కేటాయించారు. ప్రజావేదికపై సీఎం ప్రసంగం కార్యక్రమం ఉంటుందన్నారు. అమలాపురం ఆర్డీవో, అడిషనల్ ఎస్పీ, ప్రసాద్ కాన్వాయ్ ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. జేసీ టీ నిషాంతి, ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ సీఎం పర్యటన ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజకుమారి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

శ్రీలలితకు కలెక్టర్ అభినందనలు

అమలాపురం రూరల్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీహెచ్‌డీ ప్రవేశం పొందిన శ్రీలలితను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం అభినందించారు. ప్రముఖ ఆస్ట్రాలజీ రంగం (జ్యోతిష్య) శాస్త్రవేత్త కర్రా సంతోష్ శాస్త్రి సతీమణి అయిన శ్రీలలిత ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ (కృత్రిమ మేధ) రంగాల్లో పరిశోధన చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్లారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వారణాసిలో ఆమె పీహెచ్‌డీ ప్రవేశం పొందడం అభినందనీయమని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

థియేటర్లలో ఆహార పదార్థాల విక్రయాలపై పర్యవేక్షణ



అమలాపురంలోని ఓ సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న జేసీ నిషాంతి, రెవెన్యూ అధికారులు

అమలాపురం టౌన్: సినిమా థియేటర్లలో ఆహార పదార్థాలు, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్ల నిర్వహణపై ఇక నుంచి నిరంతన పర్యవేక్షణ ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) టి.నిషాంతి థియేటర్ల యాజమాన్యాలకు సూచించారు. థియేటర్ల యాజమన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అమలాపురంలోని శేఖర్ థియేటర్‌ను జేసీ నిషాంతి రెవెన్యూ అధికారులతో కలసి బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా థియేటర్ల యాజమాన్యాలు నడుచుకోవాలని ఆమె సూచించారు. థియేటర్లలో తినుబండారాల ధరలను పెంచి అమ్మితే ఆయా యాజమానులపైనే కాకుండా దుకాణదారులపై కూడా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జేసీ నిషాంతి వెంట అమలాపురం తహసీల్దార్ పి.అశోక్‌ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఏలేశ్వరరావు తదితరులున్నారు.

డ్రగ్స్ రహిత పుదుచ్చేరికి కృషి చేయాలి

యానాం: డ్రగ్స్ రహిత పుదుచ్చేరికి సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని పుదుచ్చేరి కలెక్టర్ కులుగొంత్తన్ కోరారు. బుధవారం నెలవారీ కలెక్టరేట్‌లో నిర్వహించే డ్రగ్స్ నియంత్రణ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ రవాణాను, పంపిణీని అరికట్టేందుకు అధికారులు నిఘా ఉంచాలన్నారు. స్కూల్స్, కళాశాలల దగ్గరలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషేధించాలని, అమ్మకందారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బస్సుస్టాండ్‌లు, ప్రజలు గుమిగూడే ప్రదేశాల్లో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశానికి కోస్టిగార్డు, ఫిషరీస్, సాంఘిక సంక్షేమ, ఆరోగ్య, వ్యవసాయ, విద్య, మున్సిపల్ తదితరశాఖల అధికారులు, సీనియర్ సూపరింటెండెంట్ కలైవన్నన్, కుమరన్ పాల్గొన్నారు.


2026లో డీఎంకే ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలి

యానాం: పుదుచ్చేరిలో 2026లో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలని బుధవారం ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశంలో తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్ర డీఎంకే కార్యనిర్వాహక కమిటీ సమావేశం పార్టీ చైర్మన్ ఎస్‌పీ శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం శాసన సభలో ప్రతిపక్ష నేత ఆర్ శివ మాట్లాడుతూ తీర్మానాలను వివరించారు. దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి జయంతిని పురస్కరించుకుని రాబోయే 2026 ఎన్నికల్లో పుదుచ్చేరి, తమిళనాడుల్లో డీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో కృషి చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ద్విభాషా విధానాన్ని అమలు చేయాలని తీర్మానాలు చేసామన్నారు. అనిపాల్ కెనెడీ, ఎంఎల్ తెరియనాథన్, శరవణన్, అరుమురుగం, పి గాంధీ పాల్గొన్నారు.

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ రోగికి సాయం

సఖినేటిపల్లి: మండల కేంద్రానికి చెందిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ రోగి అత్తిలి సాయి గాయత్రికి బుధవారం గొంది కనక ముత్యాలమ్మ యూత్, వేర్వేరు ప్రాంతాల దాతలు సంయుక్తంగా సమకూర్చిన నగదు మొత్తం రూ.1,47,509 అందజేశారు. ఈ మేరకు కాకినాడలోని ఒక ఆసుపత్రిలో రోగి గాయత్రికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనంతరం చికిత్స అవసరాలు నిమిత్తం ఆసుపత్రి వద్దకు వెళ్లి వారంతా రోగి కుటుంబ సభ్యులకు పై నగదును అందజేశారు.

కిశోర బాలికలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



చొప్పెల్లలో ప్రపంచ రుతుక్రమం ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

అలమూరు: కిశోర బాలికలు రుతుక్రమ సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని పరిశుభ్రత పాటించడం ద్వారా వైరస్ సంబంధిత వ్యాధుల నుంచి సంపూర్ణ ఆరోగ్య రక్షణ పొందాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ అన్నారు. ప్రపంచ రుతుక్రమం ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. రుతుక్రమ సమయంలో యుక్త వయస్సుకు వచ్చిన కిశోర బాలికలు పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం ఆయా గ్రామాల హెల్త్ క్లినిక్‌ల పరిధిలో కిశోర బాలికలతో కలసి వైద్య ఆరోగ్య సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించి రుతుక్రమంలో బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌ఎ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, హెచ్‌వీలు పి.ఉమ, ఆర్.బాలామణి, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో నీళ్ల మజ్జిగతో భోజనం

మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నేత ఫిర్యాదు



అమలాపురం అన్నా క్యాంటీన్‌లో నీళ్ల మజ్జిగ వేసి వడ్డించిన భోజనం

అమలాపురం టౌన్: ఎన్టీ రామారావు జయంతి రోజున తాను స్వయంగా అమలాపురం అన్నా క్యాంటీన్‌లో భోజనం రుచి చూద్దామని బుధవారం మధ్యాహ్నం వెళితే నీళ్ల మజ్జిగ వేశారని పట్టణానికి చెందిన బీజేపీ బిల్డింగ్ వర్కర్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల వీరబాబు తెలిపారు. అన్నా క్యాంటీన్‌ను అయిదు రోజుల కిందట అట్టహాసంగా ప్రారంభించినా దాని నిర్వహణ అధ్వానంగా ఉందని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేని కారణంగా ఆయనకు తన ఫోన్ ద్వారా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. భోజనం మెనూలో పెరుగు అని పేర్కొన్నప్పటికీ నీళ్ల మజ్జిగ వేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఇదేమిటని అన్నా క్యాంటీన్ సిబ్బందిని కొందరు ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీ నేతే ఇలా అన్నా క్యాంటీన్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.

యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవనం



యానాంలో యోగా కౌంట్‌డౌన్ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులు

యానాం: జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 25 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమాన్ని బుధవారం ఆర్‌ఏఓ మునిస్వామి ప్రారంభించారు. స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసు కాన్ఫరెన్స్ హాలులో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక మదర్ థెరిస్సా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడే పురాతన కళ అని వివరించారు. ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ఈనెల 27న పుదుచ్చేరిలో కేంద్ర ఆయుష్ మంత్రి జాదవ్, ఎల్జీ కైలాషనాథన్, సీఎం రంగసామి అధికారికంగా ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ చంద్రలక్ష్మి పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి సన్నిధిలో..

యోగాంధ్ర –2025లో భాగంగా కలెక్టర్, దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం స్థానిక వీరేశ్వరస్వామి ఆలయంలో యోగా శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు సహాయ కమిషనర్, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన యోగా గురువుల ఆధ్వర్యంలో నెలరోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, వేద పండితులు, భక్తులు, సేవా సంస్థల సేవకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



కొమారమ్మను దర్శించుకుని పూజలు చేస్తున్న భక్తులు

అయినవిల్లి: నేదునూరు శివారు శిరసవల్లి సావరంలో కొలువైన కొమారమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను బుధవారం గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి వేదపండితులు విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణాన్ని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితులు, రుత్వికుల వేదఘోష మధ్య అమ్మవారిని వైభవంగా ప్రతిష్ఠించారు. అమ్మవారికి గ్రామస్తులు విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారి అత్తింటి వారిగా కాకిలేటి వంశీకులు, పుట్టింటి వారిగా చింతలపూడి వంశీకులు వ్యవహరించడానికి గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ పూజలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

కనకమహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో నూతనంగా నిర్మించిన కనకమహాలక్ష్మి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రముఖ వేద పండితుడు కాళ్లకూరి కాశీ శేఖర్‌బాబు, కాళ్లకూరి రవితేజశర్మ మంత్రోచ్చారణల మధ్య పురోహితుల బృందం శైవాగమ పద్ధతిలో రెండో రోజు బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఈనెల 31 విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంతో పాటు భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడవద్దు



ఎస్సై శాస్త్రి

అయినవిల్లి: వాహనచోదకులు వాహనాలు నడుపుతూ అర్జెంట్ కాల్ రావడంతో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తు ఉంటారని ఇటువంటి చర్యలు వల్ల ఘోర ప్రమాదాలు సంభవించవచ్చని అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. బుధవారం ఎస్సై స్థానిక విలేకరులో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ అవసరమైందన్నారు. ఈ సెల్‌ఫోన్ వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. సెల్‌ఫోన్ అవసరం ఉండవచ్చు కానీ వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌ను ఉపయోగించకూడదన్నారు. దీని వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రయాణ సమయంలో కాల్స్ వస్తే రోడ్డు పక్కన ఎవరికీ ఇబ్బంది లేని స్థలంలో వాహనాలు ఆపి అప్పుడు కాల్స్ మాట్లాడాలన్నారు. అలాగే మైనర్లు, యువత డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారన్నారు. అటువంటి వారిపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. అమ్మాయిలను ఏడిపించే ఆకతాయిలను, దొంగతనాలకు పాల్పడే వారిని, అల్లరి మూకలను చట్టపరంగా వదిలిపెట్టేది లేదన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

తాళ్లరేవు: వృద్ధ గౌతమి గోదావరిలో గల్లంతై మృతి చెందిన యువకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు బుధవారం డిమాండ్ చేసారు. కె.గంగవరం మండలం శేరిలంకలో ఒక శుభ కార్యక్రమానికి యువకులు వచ్చి సమీపంలో ఉన్న గోదావరిలో స్నానానికి దిగి మృతి చెందారన్నారు. ఆ ప్రాంతంలో అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టిని తవ్వి తరలించడం వల్ల భారీ గోతులు ఏర్పడ్డాయని తెలిపారు. యువకులు ఆ గోతుల్లో పడి ప్రమాదానికి గురయ్యారని ఆరోపించారు. ఈ ఘటనలో నిరుపేద కుటుంబాలకు చెందిన యువకులు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. యువకులు మృత్యువాత పడడం ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని ఏడుకొండలు అన్నారు.

ఆయుష్ వైద్యులకు ఆహ్వానం

యానాం: యానాం, పుదుచ్చేరిల్లో ఆయుష్ ఆసుపత్రుల్లో మెరిట ఆధారంగా కాంట్రాక్టు ప్రాతిపదికన 11 నెలల కాలానికి వైద్యులు నియామ కానికి అర్హులైనవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం డైరెక్టరేట్ ఆఫ్ ఆయుష్ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ యానాం-3, అసిస్టెంట్ మేట్రాన్-1, స్టాఫ్ నర్సు-6, పంచకర్మ టెక్నీషియన్ (పురుష,మహిళలు)-2, యోగా ఇన్‌స్ట్రక్టర్ -1, ఫార్మాసిస్ట్-3, ల్యాబ్ టెక్నీషియన్-1, మసాజ్ థెరపిస్ట్ (పురుష, మహిళలు)-2, రిజిస్ట్రేషన్ క్లర్క్-1 మొత్తం 20 పోస్టులు రిజర్వేషన్, విద్యార్హతలు ఆధారంగా భర్తీ చేస్తారన్నారు. మరో 20 పోస్టులు ఇదే విధానాన్ని పుదుచ్చేరిలో భర్తీ చేస్తామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



పోలేకుర్రు వై.జంక్షన్‌లో తనిఖీ చేస్తున్న కోరంగి ఎస్సై సత్యనారాయణ సిబ్బంది

తాళ్లరేవు: రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం జాతీయ రహదారి 216లోని పోలేకుర్రు వై.జంక్షన్ చెక్‌పోస్టు వద్ద ఆయన సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 23 మంది వాహనదారులకు చలాన్ల ద్వారా రూ.4,290 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



మృతుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

ఐ పోలవరం: ముమ్మిడివరం వద్ద ఈనెల 26న గోదావరిలో స్నానానికి దిగి మృతి చెందిన ఐ పోలవరం మండల పరిధిలో ఎర్రగరువుకు చెందిన సోదరులు వడ్డి రాజేష్, మహేష్ కుటుంబాన్ని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోదరులు మృతిచెందడం చాలా బాధాకరమని అన్నారు. అనంతరం మృతుల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.